జమ్ములమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

- మూడ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- 5వ తేదీ తెల్లవారుజామున రథోత్సవం


కంచుపాడులో పార్కింగ్ స్థలం లేక అస్తవ్యస్తంగా నిండిన వాహనాలు


కంచుపాడులో రేణుక ఎల్లమ్మ ఆలయం

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో వెలిసిన రేణుక ఎల్లమ్మ (జమ్ములమ్మ) ఆలయంలో ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 5న పౌర్ణమి సందర్భంగా తెల్లవారు జామున రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాటు చేశారు. ఇదివరకు తాగునీరు, ఆలయ ప్రాంగణంలో భూమి చదును చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి రథోత్సవానికి భక్తులు హాజరవుతారని ఆలయ చైర్మన్ పేర్కొన్నారు. ప్రతి మంగళవారం పెద్ద ఎత్తున్న నైవేద్యాలను అందజేసి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని తెలిపారు.

రథోత్సవానికి సన్నద్ధం

ఆలయంలో దాతల సహకారంతో అమ్మవారి రథాన్ని ఏర్పాటు చేశారు. వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున దీనికి తగిన ఏర్పాటు పూర్తి చేశారు.

పార్కింగ్‌కు తప్పని తిప్పలు

జాతరకు వచ్చే భక్తులకు పార్కింగ్‌కు స్థలం కేటాయించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అమ్మవారి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ప్రతి ఏడాది పార్కింగ్ సమస్య అధికంగా ఉందని, ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఏర్పాటు చేయడంతో ఆలయానికి రావడానికి దారి లేకుండా చాలా ఇబ్బందులకు గురవుతునట్లు పలువురు తెలిపారు.

పనులు పూర్తి చేశాం



పౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న అమ్మవారి రథోత్సవానికి అన్ని పనులు ముమ్మరం చేసి పూర్తి చేశాం. ఆలయంలో భక్తుల సౌకర్యార్థంలో తాగునీరు వసతి కల్పించాం. ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహిస్తున్నం. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.

– సత్యారెడ్డి, ఆలయ చైర్మన్, కంచుపాడు

సమస్యలను అధికారులకు విన్నవించాం



ఆలయంలో ఉన్న సమస్యలను అధికారులకు విన్నవించాం. భక్తుల సౌకర్యార్థం మినీ తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరాం. మరుగుదొడ్ల ఏర్పాటుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– శేషన్ గౌడు,సర్పంచు, కంచుపాడు

చర్యలు తీసుకుంటాం

అమ్మవారి ఆలయంలో భక్తులకు నీటి, పార్కింగ్ సదుపాయం కలిస్తాం. మహిళలకు మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

–ఆంజనేయ రెడ్డి, ఎంపీడీఓ, ఉండవెల్లి

పంధుల షెడ్డుకు అనుమతి ఇవ్వొద్దు


కంచుపాడులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో వైకుంఠ ధామం సమీపంలో పందుల షెడ్డును ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్తులు కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. పందుల షెడ్డుకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని పంచాయతీ కార్యదర్శి జరీనాబేగంకు సూచించారు. అనంతరం నర్సరీలలో మొక్కలను సంరక్షించాలన్నారు. డ్రైడే సందర్భంగా మొక్కలకు నీరు అందించి కాపాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఉండవెల్లి: దళితుల ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ మండల కార్యదర్శి మహేష్‌లో కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీరభద్రప్పకు సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు వినతిప్రతం అందజేశారు. ప్రభుత్వం ఖాళీ స్థలం ఉన్న పేదలకు రూ.3 లక్షలు ప్రకటించిందని పేర్కొన్నారు. దళితులకు రూ.3 నుంచి రూ. 6 లక్షలకు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఎస్సీలకు విద్యుత్ రాయితీలు 101 నుంచి 200 యూనిట్లకు పెంచాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి 2019, 2020, 2021 లలో పెండింగ్ ఉన్న బడ్జెట్‌ను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, మహేశ్వర్ రెడ్డి, పకీరా, శివ, మధు, పరుశురామ్, నరసింహ, వెంకటేశ్వర్లు, చిన్న సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్ తప్పనిసరి


సోంపురంలో వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

కేటీదొడ్డి: మండలంలోని సోంపురంలో 4 నుంచి 8 నెలలలోపు దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాక్సిన్ శుక్రవారం వేశారు. ఈసందర్భంగా సర్పంచు తిక్కన్న మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు ప్రత్యేక వ్యాక్సిన్ ఉచితంగా వేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్ మిత్రలు గోపాల్ రెడ్డి, భీమయ్య, పశువైద్య సిబ్బంది మోహన్ తదితరులు ఉన్నారు.

పశువులకు బ్రుసెల్లోసిస్ టీకాలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని గాంధీనగర్, తిమ్మాజిపల్లి గ్రామాల్లోని పశుపోషకులకు చెందిన గేదె, ఆవు దూడలకు శుక్రవారం బ్రుసెల్లోసిస్ టీకాలు వేసినట్లు వీఎల్ఓ తెలిపారు. చిన్న వయసులో టీకాలు వేయించడం వల్ల దూడలు పెద్దయ్యాక గర్భస్రావాలు జరగవని, గర్భాశయానికి సంబందించిన వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేస్తున్నట్లు ఆయన వివరించారు. యజమానులు వారికి సంబంధించిన దూడలకు తప్పనిసరిగా టీకాలు వేయించి పశుసంపద అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ లతీఫ్, ఓఎస్ రవి, వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్ర లక్ష్మన్నలు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంలో పశువులకు శుక్రవారం దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశువులకు తప్పనిసరిగా టీకాలను వేయించాలన్నారు. అలాగే పశువుల పెంపకంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, రామాంజనేయులు, రాజేంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు సంఘీభావం


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

మానవపాడు: మండల కేంద్రంలో దళితశక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏతూ మణిప్రకాశ్, నాగరాజు, యాదవ్, శేఖర్, మహరాజ్, శ్రీనివాసులు సంఘీభావం తెలిపి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజస్థాపన కోసం డాక్టర్ విశారదన్ మహరాజ్ 10 వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రకు వారు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగర్జున, ప్రదీప్, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

రాజోళి: అర్హులందరికి ఇళ్ల స్థలాలు, స్థలాలు ఉన్న వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. 2009లో వచ్చిన వరదల కారణంగా మండలంలోని నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పూర్తిగా కేటాయించలేదని, ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, లక్ష్మన్న, గోకారి, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

గద్వాలరూరల్: డబుల్ బెడ్రూం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇళ్లు ఇవ్వాలని సీఐటీయూ, ఐద్వా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికి డబుల్ బెడ్రూం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటస్వామి, నర్సింహా, నర్మద, తిరుపతన్న, ఆంజనేయులు, గట్టన్న పాల్గొన్నారు.

హీరో కల్యాణ్ రామ్ సందడి

అలంపూర్: తెలంగాణ రాష్ట్ర సరిహద్దు సమీపంలో పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద హీరో నందమూరి కల్యాణ్ రామ్ అభిమానులతో సందడి చేశారు. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు ఏమిగోస్ చిత్ర ట్రైలర్ లాంచింగ్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో శుక్రవారం ఉండవెల్లి మండలం పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద కల్యాణ్ రామ్‌కు అభిమానులు ఘనస్వాగతం పలికారు. హీరో కల్యాణ్ రామ్ కారు నుంచి అభిమానులకు అభివాదం చేసి ఉత్సాహపరిచారు.

క్లుప్తంగా

నర్సరీ మొక్కల పరిశీలన



మానవపాడు: మండలంలోని కలుకుంట్లలో సెగ్రిగేషన్‌షెడ్, నర్సరీలను శుక్రవారం జిల్లా పరిషత్ ఉపముఖ్య కార్యనిర్వహణ అధికారి ముషాహీదాబేగం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నర్సరీలోని మొక్కలకు క్రమం తప్పకుండా నీటి సదుపాయాన్ని అందించాలని సూచించారు. ప్రతి బ్యాగ్‌లో మట్టిని నింపాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలను పరిశీలించి, మొక్కలు లేని చోటా కొత్తగా నాటాలన్నారు. కార్యక్రమంలో సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో నది అగ్రహారం రోడ్డులోని 132 కేవీ గద్వాల సబ్‌స్టేషన్‌లో ఉన్న 33 కేవీ ఫీడర్ల మరమ్మతు నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్దకల్, ఖిజ్వారం, ధరూరుకు సంబంధించిన 33 కేవీ లైన్లు మరమ్మతు కారణంగా 33 కేవీ ఫీడర్ల పరిధిలోని ఉప కేంద్రాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

అయిజ: మండలంలోని వివిధ ఆలయాల్లో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. పట్టణ సమీపంలోని కట్టకిందితిమ్మప్ప స్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను రథోత్సవంలో ఊరేగించనున్నారు. సోమవారం ఉట్టి కొట్టే కార్యక్రమం, మంగళవారం చక్రస్నానానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా మండలంలోని రాజాపురంలో శనివారం నుంచి గుంటిరంగనాథ స్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతాయి. లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అభిషేకం, గంగ పూజ, పల్లకీ సేవ నిర్వహించి రాత్రి ప్రభోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, రాత్రి రథోత్సవం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈనెల 6, 7వ తేదీల్లో అంతర్రాష్ట్ర ఉమెన్స్ కబడ్డీ పోటీలు, 8వ తేదీ న్యూ కేటగిరి విభాగం వృషభరాజముల బల ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డిలో దేవమ్మ ఆలయ నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి రూ. 10 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం కార్యకర్తలు ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. దాతలు ఆలయ నిర్మాణానికి ముందుకు రావాలని ఆలయ కమిటీ సభ్యుడు శివన్న కోరారు.

బాలల హక్కులపై అవగాహన

అయిజ: మండలంలోని వెంకటాపురంలో ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ కమిటి లీగల్ ఆఫీసర్ శివ మాట్లాడుతూ బాలల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరేశ్, హెడ్ మాస్టర్ ఆనంద రాజు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూర్: మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శనివారం వస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. మండలంలోని మూలమల్ల ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు, మనబడి కార్యక్రమంలో భాగంగా నూ తనంగా నిర్మించిన భవనాలను ప్రారంభిస్తారని తె లిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి పార్టీ నాయకులు రావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శివలింగం ప్రతిష్ఠాపన

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని నాగరాల-1 సెంటరులో శనివారం శివ భక్తులు భారీసంఖ్యలో పాల్గొని ఘనంగా శివలింగం, గణపతి, నంది విగ్రహాలను వేదపడింతులచే ప్రతి ష్ఠించారు. ఈ సందర్భంగా వేదపడింతులు మహాయంత్రస్థాపన, హోమాలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నిర్మలరాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో భూ నిర్వాసితులు



పోలీసుల అదుపులో చిన్నోనిపల్లె భూ నిర్వాసిత రైతులు

గట్టు: చిన్నోనిపల్లె భూ నిర్వాసితులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ఏడాది కాలంగా ఐదు గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర కూడా ఆందోళన చేసి, చిన్నోనిపల్లె భూ నిర్వాసితుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీ ప్రారంభమైన తరుణంలో ప్రభుత్వ దృష్టికి మరో మారు చిన్నోనిపల్లె రిజర్వాయర్ రద్దు విషయాన్ని తీసుకెళ్లే అవకాశం ఉన్నందున ముందుజాగ్రత్తగా ఆందోళన చేస్తున్న నిర్వాసితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం వారిని స్వంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

కలెక్టర్‌కు వినతి

గద్వాలరూరల్: జిల్లాలోని నిరుపేదల దళితులకు దళితబంధు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ వల్లూరి క్రాంతిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. మొదటి విడత ఇచ్చిన దళితబంధు అధికార పార్టీకి చెందిన నాయకులే తమ అనుచరులకు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా దళితబంధు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉస్సేన్ శ్రీకర్, రవిపాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత

అయిజ: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్లను ఐటీ సెల్ సహకారంతో సేకరించినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు. దీంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మిర్చి పంటపై గడ్డి మందు పిచికారీ


దెబ్బతిన్న మిర్చి పంటను చూపుతున్న రైతు నర్సింహులు

గట్టు: మిర్చి పంటపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని తప్పెట్లమొర్సు గ్రామానికి చెందిన రైతు పెద్ద నర్సింహులు గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో ఎకరన్నరలో మిర్చి పంటను సాగు చేశాడు. పంట చేతికందుతున్న తరుణంలో గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి మిర్చి పంటపై గడ్డి మందును పిచికారీ చేశారు. దీంతో పంట దెబ్బతిన్నది. పంట సాగుకు రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు బాధిత రైతు తెలిపాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో రైతు ఫిర్యాదు చేశాడు.

కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా


మానవపాడులో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మానవపాడు: అర్హులందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ సర్దార్‌మియ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి రూ. 3 లక్షల నుంచి 5 లక్షల వరకు పెంచాలని కోరారు. రాజు, ఎండీ మాలిక్, భీసన్న, తిమ్మప్ప, మద్దిలేటి, పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేల హాజరు


అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

మొక్కలను సంరక్షించాలి


మొక్కలను నీరు పడుతున్న ఎంపీడీఓ రమణారావు

మానవపాడు: జాతీయ రహదారులు, ఇతర రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటి కాపాడాలని ఎంపీడీఓ రమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని జల్లాపురం, నారాయణపురం, కలుకుంట్ల, మద్దూరు, మానవపాడు రహదారులపై మొక్కలకు నీటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలు ఏవైనా ఎండిన, లేనిచోట తప్పకుండా మొక్కలను తిరిగి నాటాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తోమాలపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెబ్బేరు: తోమాలపల్లిలో మత్స్య కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఏర్పాటు చేస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య కళాశాల బృందం తోమాలపల్లిని దత్తత తీసుకోని రైతులకు, ప్రజలకు ఎన్ఎస్ఎస్ శిబిరం కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈ శిబిరంలో విద్యార్థులు చేపల కట్లేట్, చట్నీ, ఫ్రై తయారీకి సంబంధించిన పద్ధతులను ప్రదర్శించి గ్రామ ప్రజలకు వాటిని తినిపించారు. కార్యక్రమలో జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, కళాశాల డీన్ డాక్టర్ నాగలక్ష్మి, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ లావణ్య, మన్నెం, మధు, మొగులన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని పామిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో రామాలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది శ్రీరామనవమిని పురస్కరించుకొని గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నిరంజన్‌రెడ్డి రామాలయం నిర్మాణానికి రూ.6లక్షలు విరాళం ప్రకటించారని తెలిపారు. వీటితో పాటు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, పూజారి రుక్మయ్య, శీలయ్యగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, దత్తాత్రేయరెడ్డి, మహేష్, చందు తదితరులు పాల్గొన్నారు.